

ప్రజా సమస్యల పరిష్కారానికి నేడు ధర్నా

వివిఎస్ఆర్ రాక

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో నేడు ప్రదర్శన, కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. మార్చి8 నుంచి 28వరకు జిల్లా వ్యాప్తింగా సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్రలు నిర్వహించారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ప్రధానంగా దోమలు, ఐరిగేషన్ సమస్యలు, ధాన్యం మద్దతు ధర, మౌలిక సదుపాయాలు, శ్మశాన వాటికలు, మంచినీరు, ఇంకనూ అనేక సమస్యలను నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు నేడు నగరంలో ఆ పార్టీ భారీ ర్యాలీ నిర్వహించనుంది. ఉదయం 10గంటలకు స్థానిక వివిఆర్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం ధర్నా చేపట్టనున్నారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరు కానున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ కోరారు.

పార్కులను అందుబాటులోకి తీసుకురావాలి

మాట్లాడుతున్న కమిషనర్ సూర్యతేజ

ప్రజాశక్తి-నెల్లూరు

నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని పార్కులలో జిమ్ పరికరాలు, పచ్చదనం, పెయింటింగ్ తదితర మౌలిక వసతులను కల్పించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ సూర్య తేజ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా కమిషనర్ శుక్రవారం 18వ డివిజన్ హరనాథపురం, పరిసర ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలో నగరపాలక సంస్థకు చెందిన సుమారు ఒకటిన్నర ఎకరాల ఖాళీ స్థలానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించి పార్కు నిర్మాణానికి కృషి చేస్తామని తెలియజేశారు. స్థానిక డివిజన్లో 11 ప్రాంతాలలో పార్కుల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని, అందులో తొలుతగా ఐదు పార్కులను అభివృద్ధి చేసే పార్కులలో అవసరమైన ఆట వస్తువులు, క్రీడా పరికరాలు, వ్యాయామ సౌకర్యాలు, పాదచారుల ట్రాక్, పచ్చదనం, పెయింటింగ్, బెంచీలు తదితర మౌలిక సదుపాయాలను కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పార్కులను అభివృద్ధి చేసి త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తేనున్నామని కమిషనర్ వెల్లడించారు. నగరవ్యాప్తంగా ప్రణాళికాబద్ధమైన పారిశుద్ధ్య నిర్వహణకు, దోమల నిర్మూలనకు ప్రత్యేకంగా చేపట్టిన భూగర్భ డ్రైను వ్యవస్థలో అన్ని గృహాలను అనుసంధానం చేసి, పరిశుభ్రంగా నగరాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని కమిషనర్ తెలిపారు. భూగర్భ డ్రైను వ్యవస్థకు గృహాలను అనుసంధానించేందుకు సుమారుగా 5 వేల రూపాయలు ఖర్చు అవుతుండగా, పట్టణ పురపాలక శాఖ మంత్రివర్యులు పి. నారాయణ ఆదేశాల మేరకు భూగర్భ డ్రైను అనుసంధానం ప్రక్రియను అన్ని గృహాలకు పూర్తి ఉచితంగా చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో అన్ని గృహాలను భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు అనుసంధానించేలా ప్రణాళికాబద్ధమైన చర్యలు పూర్తి చేస్తున్నామని కమిషనర్ వెల్లడించారు. నగరపాలక సంస్థ పరిధిలోని అన్ని ఖాళీ స్థలాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా యజమానులకు నోటీసులు జారీ చేస్తున్నామని, ప్రతి ఒక్కరు తమ స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మాణం, గేటు ఏర్పాటు, తగిన రక్షణ చర్యలను తీసుకుంటూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు దోహదపడాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అశోక్ కుమార్, ఇంజనీరింగ్ విభాగం ఎస్.ఈ. రామ్ మోహన్ రావు, అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ ప్రదీప్ కుమార్, వెటర్నరీ డాక్టర్ మదన్ మోహన్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శేషగిరిరావు, రెవెన్యూ ఆఫీసర్ ఇనాయతుల్ల, అధికారులు, సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పార్కింగ్ ఫీజుల క్రమబద్ధీకరణ

ప్రజాశక్తి-నెల్లూరు: రాష్ట్రంలోని మల్టీప్లెక్స్ లు, షాపింగ్ మాల్స్ లో వాహన పార్కింగ్ రుసుములను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. నగరపాలక సంస్థ పరిధిలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమలులోకి తేనున్నామని కమిషనర్ సూర్య తేజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయం ప్రకారం మల్టీప్లెక్స్ లు, షాపింగ్ మాల్స్ లో మొదటి 30 నిమిషాల వరకు వాహన పార్కింగ్ రుసుములు పూర్తిగా ఉచితమని తెలిపారు.30 నిమిషాల నుంచి గంట వరకు పార్కింగ్ చేసిన వ్యక్తులు మల్టీప్లెక్స్ లు, మాల్స్ లో ఏదైనా వస్తువు కొన్నట్లుగా బిల్లులు చూపిస్తే అలాంటి వారికి రుసుములు వర్తించవని వెల్లడించారు. గంటకుపైగా పార్కింగ్ చేసిన వాహన చోదకులు సినిమా టికెట్, ఇతరత్రా బిల్లులు చూపినట్లయితే ఉచితమని, ఆధారం చూపని వారి నుంచి రుసుములు వసూలు చేయొచ్చన్నారు.

వలంటీర్లకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-కందుకూరు

మండల న్యాయసేవాధికార కమిటీలు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో స్వచ్ఛందంగా న్యాయ సేవా సహాయకుల (పారా లీగల్ వలంటీర్)గా పనిచేసే ఉద్దేశం ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.భారతి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రజలకు న్యాయ రక్షణ సంబంధితవిషయాలతోపాటు చట్ట పరిధిలో న్యాయం చేయాలనే ఆలోచన, విషయ పరిజ్ఞానం ఉన్నవారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. న్యాయసేవా సహాయకులుగా నియమితులైన వారికి గౌరవ వేతనం మాత్రమే అందిస్తామని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు ఇంటర్ ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు ఆసక్తి ఉన్నవారు మండల న్యాయ సేవాధికార సంస్థ కందుకూరు ఫోన్ నెంబర్ 08598222228 సంప్రదించగలరు.

గోడౌన్లలో తనిఖీ

ప్రజాశక్తి-నెల్లూరు

ఈవీఎంల గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేసి నిరంతరం నిఘా ఉంచాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. త్రైమాసిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యాలయ ప్రాంగణంలోని ఈవీఎంల గోడౌన్లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గోడౌన్ల లోని ఈవీఎంలు, వివి ప్యాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్డిఓ అనూష, తహశీల్దార్ షఫీ మాలిక్, డీటీ అశోక్ వర్ధన్, టిడిపి, బిజెపి, కాంగ్రెస్, బిఎస్పీ పార్టీల ప్రతినిధులు రసూల్, శ్రీనివాస్, బాల సుధాకర్, శ్రీరామ్ తదితరులున్నారు.

కార్మిక ఉద్యమ నేత మాలకొండారెడ్డి

ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-నెల్లూరు

కార్మిక ఉద్యమ నేత, ప్రజానాయకుడు వి.మాల కొండారెడ్డి అని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ అన్నారు. శుక్రవారం నగరంలోని శెట్టిగుంట రోడ్డు సెంటర్లోని మాలకొండ రెడ్డి భవనంలో సిపిఎం మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు, మాజీ నగర కార్యదర్శి మాలకొండారెడ్డి 40వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ హాజరయ్యారు. ముందుగా వి.మాల కొండారెడ్డి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మూలం రమేష్ మాట్లాడుతూ నగరంలో సిపిఎంను బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి మాలకొండ రెడ్డి అని అన్నారు. కార్యకర్తలకు ఎప్పుడు అందుబాటులో ఉండి వారికి ఏ ఇబ్బంది వచ్చినా ముందుండే పరిష్కారం చేసే వారు అని కొనియాడారు. ప్రజలకు సేవ చేయడంలో మాలకొండారెడ్డి ఎప్పుడు ముందుండే వారన్నారు. అటువంటి వ్యక్తి వర్ధంతి సందర్భంగా ప్రతి సంవత్సరం ఏదొక సేవా కార్యక్రమం చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు.అందులో భాగంగానే ఈ సంవత్సరం వాసన్ ఐ కేర్ వారి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. అనంతరం లైన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వందవాసి శ్రీహరి మాట్లాడుతూ మాలకొండా రెడ్డి వర్ధంతి సందర్భంగా జరిగే ఉచిత కంటి వైద్య శిబిరంలో లయన్స్ క్లబ్ నుండి ప్రజలకు ఐ డ్రాప్స్ పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రజలకు సేవ చేయడం కమ్యూనిస్టులు ఎప్పుడు ముందుంటారన్నారు. అలాంటి కమ్యూనిస్టులు చేసే సేవలో మమ్మల్ని భాగస్వామ్యం చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు.ఇలాంటి కార్యక్రమాలు ఎప్పుడు జరిగినా తమకు సమాచారం ఇస్తే మా వంతు మేము కూడా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు.అనంతరం శాఖ కార్యదర్శి కె. చెంగయ్య మాట్లాడుతూ ఈ ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారని వారిలో 20 మంది పైగా ఉచిత కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించామన్నారు. త్వరలో కంటి శస్త్ర చికిత్సలు చేయించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కంటి ఉచితవైద్య శిబిరానికి సహకరించిన వాసన ఐ కేర్ హాస్పిటల్ వారికి ఐ డ్రాప్స్ ఉచితంగా ఇచ్చిన లయన్స్ క్లబ్ వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గ సభ్యులు జి నాగేశ్వరరావు, ఎస్.కె మస్తాన్‌బీ, పి సూర్యనారాయణ, నగర్ కమిటీ సభ్యులు బిపి నరసింహ, అల్లంపాటి శ్రీనివాసలు రెడ్డి, చిరంజీవి కె.వి.రమణారెడ్డి, శాఖ సభ్యులు ఏ నాగయ్య, పి నాగరాజు, తిరుపాలు, సుందర్ రాజన్ పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ధర్నా

ప్రజాశక్తి-గుడ్లూరు

పెంచిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలని సిపిఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గుడ్లూరులోని విద్యుత్ కార్యాలయం దగ్గర శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కన్వీనర్ గంటనపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జగన్ పాలన హయాంలో వివిధ రకాల పేర్లతో 32 వేల 166 కోట్లకి పైగా విద్యుత్తు ఛార్జీలు పెంచి నిరుపేద వర్గాలపై పెను భారం మోపారని, సమయంలో ఎన్నికలకు ముందు తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్లపాటు విద్యుత్ ఛార్జీలు పెంచమని చంద్రబాబు హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలు ఊరట చెందారని ఒక సభలో అదా నీతో ఒప్పందం కుదుర్చుకొని ఏర్పాటు చేస్తున్న స్మార్ట్ మీటర్లు పగలగొట్టాలని నారా లోకేష్ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ట్రూ ఆఫ్ పేరుతో 15 వేల కోట్ల రూపాయలు విద్యుత్తు ఛార్జీలు ఏడా పెడాగా పెంచి గుట్టు సప్పుడు కాకుండా స్మార్ట్ మీటర్లు బిగించే పనిలో పడి ఆదాని ఒప్పందాన్ని యథావిధిగా కొనసాగిస్తున్నారన్ని విమర్శించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే తగ్గించే వరకు ప్రజలు పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ అధికారులకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. సీనియర్ సిపిఎం నాయకులు మద్దిశెట్టి జాలయ్య, దామా కృష్ణయ్య, సిపిఎం కార్యదర్శులు కొట్టే వెంకయ్య, బుచ్చి మల్లికార్జున, కె నారాయణ, తిరుపాలు, సుంకర విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

విరాళం అందజేత

ప్రజాశక్తి-కందుకూరు: పట్టణ ప్రజల భద్రతా చర్యలలో భాగంగా కాలేజీ పరిసర ప్రాంతాలలో విద్యార్థినిల భద్రత వారి బాధ్యతగా భావించి సీసీ కెమెరాలు ఏర్పాటుకు నక్షత్ర కాలేజీ కరస్పాండెంట్ శ్రీనివాసులు రూ.18,000 లు, సిద్ధార్థ స్కూలు కరస్పాండెంట్ రామారావు రూ. 12,000 లు కందుకూరు పోలీస్ స్టేషన్‌కు విరాళంగా అందజేశారు.సీసీ కెమెరాలు పోలీస్ విభాగానికి ఉపయోగపడటమే కాకుండా, ప్రజలకు మరింత భద్రతను అందించేలా ఉంటాయి. భవిష్యత్తులో సమాజానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

మాట్లాడుతున్న కంచర్ల రామయ్య

ఘనంగా వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-కందుకూరు: టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లపుడు చేస్తానని ప్రకాశం ఇంజినీరింగ్ కాలేజి కరాస్పాండెంట్ కంచర్ల రామయ్య చెప్పారు. కందుకూరు టిఆర్ఆర్ కళాశాల వార్షికోత్సవం శుక్రవారం ఎంతో ఉత్సాహంగా ఘనంగా నిర్వహించడం జరిగింది. కళాశాల స్వయం ప్రతిపత్తి హెూదా , నాక్ ఏ ప్లస్ గ్రేడ్ సాధించిన తర్వాత నిర్వహించిన మొట్టమొదటి వార్షికోత్సవ సభకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రవి కుమార్ కళాశాల సాధించిన ప్రగతిని వివరించారు. కళాశాలలో అత్యున్నత అర్హతలు గల అధ్యాపకులు, ఏ కళాశాలలో కూడా లేనటువంటి ఆస్థాపన సౌకర్యాలు, విద్యార్థినీ విద్యార్థుల్ని ఉద్యోగార్దులుగా తయారు చేసే ప్రక్రియ తమ సొంతమని తెలియజేశారు. భవిష్యత్తులో కూడా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎంతో ఉన్నత స్థానానికి ఎదగడానికి అనుకూలమైన విద్యావాతరణం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కళాశాల ఆలుమ్ని అసోసియేషన్ చైర్మన్, ప్రకాశం ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ కంచర్ల రామయ్య మాట్లాడుతూ ఈ కళాశాల అంచలంచలుగా ఎదుగుతూ రాష్ట్రంలోనే నంబర్ వన్ కళాశాలగా తయారు కావడం ఎంతో సంతోషమని తెలిపారు. దీనికి కృషి చేసిన దాతలు, పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు, విద్యార్థుల విద్యార్థులను అభినందించారు. తాను కళాశాలకు ప్రతి సంవత్సరం ఆర్థిక సహాయం చేస్తున్నానని, దానిని భవిష్యత్తులో కూడా కొనసాగిస్తానని తెలియజేస్తూ, విద్యార్థినీ విద్యార్థులు మరింత మెరుగైన కృషి చేయాలని ఉద్బోధించారు.ఎంతమందికైన బహుమతులు ఇవ్వాడానికి నేను సిద్ధంగావున్నానని కంచర్ల రామయ్య అన్నారు. ఈ సందర్భంగా వి వై కోటారెడ్డి మెమోరియల్ బంగారు పతకాలు సాధించిన ఎస్కే. ఉజ్మా, వై. స్నేహ, ఎం.రమణి లను కళాశాల అధ్యాపక బృందంతో పాటు ఆయన కూడా అభినందించారు. కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జేసుదాస్ మాట్లాడుతూ ఈ కళాశాల మరింత అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏడుకొండల నరేంద్ర, ఎన్వి శ్రీహరి, కే సుజాత, పి రాజగోపాల్, కె వి పద్మావతి,ఇతర అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. సభానంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ : మండలంలోని చెమిడిద పాడు గ్రామంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద ఆదేశాలలో భాగంగా గ్రామ సర్పంచ్ చిత్తారు హైమావతి గ్రామం లో పారిశుధ్య పనులను గ్రామంలోని సైడ్ కాలువలలో పేరుకుపోయిన చెత్తను తొలగించడం జరిగింది. అనంతరం మంచినీటి బావి దగ్గర చుట్టూ ఉన్న జంగిల్‌ని తొలగించి బ్లీచింగ్ చల్లడం. మంచినీళ్ల ట్యాంకును శుభ్రం చేయించడం జరిగింది.చెత్త నుండి సంపదను సృష్టించే కేంద్రం చుట్టూ ఉన్న జంగిల్ ను తొలగించారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిత్తారు మల్లికార్జున,తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

ప్రజాశక్తి-గుడ్లూరు రూరల్ : మండలంలోని తేట్టు గ్రామంలో ఉగాది, రంజాన్ సందర్భంగా స్వర్ణాంధ్ర స్వచ్ఛంద ఆదేశాలలో భాగంగా కుమ్మరిపాలెం,తూర్పు పాలెం,జహంగీర్ పాలెం, పడమటిపాలెం లో రోడ్డు పక్కన ఉన్న ముళ్ల చెట్లను తొలిగించారు. రోడ్డుకిరువైపులా ఉన్న మురుగు కాలువలను శుభ్రపరిచారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మార్టిన్, గ్రామ నాయకులు షేక్ బాబు, షేక్, జిలానీబాషా పాల్గొన్నారు.

వెట్టిచాకిరి నిర్మూలన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-నెల్లూరు : వెట్టిచాకిరి వ్యవస్థలోని కార్మికులను గుర్తించడంలో రెవెన్యూ అధికారులు ముఖ్య పాత్ర పోషించాలని నెల్లూరు రెవెన్యూ డివిజనల్ అధికారి అనూష సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లో తిక్కన ప్రాంగణంలో నెల్లూరు, ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, రెవెన్యూ అధికారులకు వెట్టి చాకిరి నిర్మూలన చట్టంపై అవగాహన కోసం సాంఘిక సంక్షేమ శాఖ, ఇంటర్నేషనల్ జస్టిస్ మిషన్ ప్రతినిధులు శ్యామ్, గంటా ప్రియాంక ఆధ్వర్యంలో వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ అనూష మాట్లాడుతూ జిల్లాలో పరిశ్రమలు ఎక్కువగా ఉన్నందున వెట్టి చాకిరి నిర్మూలన చట్టాలపై అవగాహన అవశ్యమన్నారు. అందజేశారు.

కరపత్రాలు అందజేస్తున్న సిపిఎం నాయకులు

సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-కోవూరు: మండలంలోని సమస్యలు పరిష్కరించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీతాపోలయ్య భవనంలో కరపత్రాలు ఆవిష్కరించారు. పట్టణంలోని పలుచోట్ల దుకాణదారులకు, పాదచారులకు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ ఇటీవల మార్చి 8వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రజాచైతన్య యాత్రలు కొనసాగించామన్నారు. మండలంలోని పోతిరెడ్డిపాళెం, పాటూరు, గుమ్మళ్లదిబ్బ, పెద్దపడుగుపాడు, గంగవరం, తదితర గ్రామాల్లో సమస్యలు సిపిఎం నాయకుల దృష్టికి తీసుకొచ్చారు. ఈసమస్యలను తహశీల్దార్ కార్యాలయం, సచివాలయాల్లో సిపిఎం నాయకులు వినతిపత్రాలు సమర్పించారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే తగ్గించే వరకు ప్రజలు పోరాటాలు చేస్తారని హెచ్చరించారు. స్మార్ట్ మీటర్లు పెట్టకుండా అడ్డుకుంటామని హెచ్చరించారు. నేడు సిపిఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హాజరవుతున్నారు.కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గండవరపు శేషయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఎస్‌కె బాబు, అప్రోజ్, వూటుకూరు వెంకటరమణయ్య, చాన్‌బాషా, సురేష్, ఎజ్దానీ, తదితరులు పాల్గొన్నారు.

సెంటు భూమి ఇవ్వం..

ప్రజాశక్తి-ఉలవపాడు: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ కంపెనీ వారికి కరేడు గ్రామానికి చెందిన 8300 పై చిలుక ఎకరాలకు భూములకు సంబంధించి జీఓ విడుదల చేయడం దారుణమని మాజీ ఎంపీటీసీ సభ్యుడు మిరియం శ్రీనివాసులు ఒక ప్రకటనలో తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తపరిచారు. భారీ పరిశ్రమకు 69 వేల కోట్లతో పరిశ్రమ ఏర్పడుతుంటే అందుకుగాను 49 వేల కోట్లు సబ్సిడీ ఇవ్వడం ఏమిటన్నారు. పరిశ్రమల పేరుతో వేల ఎకరాలు బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టడం రైతులను దగా చేయటం ఏమిటని పేర్కొన్నారు. ప్రాణాలైనా అర్పిస్తాం కానీ సెంటు భూమి ఇవ్వబోమని తెలిపారు. కరేడు నుండి బింగినపల్లి గ్రామం వరకు వేల ఎకరాల అవసరమా అని ప్రశ్నించారు. గ్రామ సభలు పెట్టకుండా, రైతుల ఆమోదం లేకుండా, జీఓలు జారీ చేయడం రైతుల ఆమోదం లేకుండా భారీ పరిశ్రమలు ఏ విధంగా ఏర్పాటు చేస్తారన్నారు. రైతులు కోర్టులను ఆశ్రయించే విధంగా ప్రభుత్వ చర్యలు ఉన్నాయని పచ్చని పంట పొలాలలో పరిశ్రమలు ఏర్పాటు చేయమని ఏ చట్టమూ చెప్పలేదన్నారు. భూములు, పరిశ్రమలు ఇచ్చి రైతులున్న డబ్బులు ఖర్చు పెట్టుకుని భవిష్యత్తులో అనాథలుగా మిగిలారని రైతుల భూములను తీసుకొని తరువాత గ్రామాలు ఖాళీ చేయమని చెప్పే విధంగా కుట్రపూరితంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు. త్వరలో కరేడు గ్రామంలో ప్రజలతో భారీ సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని ఉద్యమ కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు.

7 నుంచి ఎన్‌టిఆర్ వైద్యసేవలు నిలిపివేత

ప్రజాశక్తి-నెల్లూరు:

ఆంధ్ర స్పెషాలిటీ హాస్పిటల్ అసోసియేషన్ (ఆశా) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏప్రిల్ 7వ తేది నుంచి ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ వైద్యశాలల్లో వైద్యసేవలు నిలిపివేస్తున్నట్లు జిల్లా నెట్‌వర్క్ వైద్యశాలల ప్రతినిధులు ప్రకటించారు. శుక్రవారం ఈ మేరకు నగరంలోని కలెక్టర్ కార్యాలయం అధికారులకు రాష్ట్ర ఆశా వైస్ ప్రసిడెంట్ డాక్టరు ఎస్‌విఎల్ నారాయణ ఆధ్వర్యంలో జిల్లా ప్రతినిధి వర్గం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అరవింద్ కిడ్ని సెంటర్ వైద్యులు డాక్టరు ఎస్‌విఎల్ నారాయణ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వైద్యసేవ క్రింద నెట్‌వర్క్ వైద్యశాలలకు భారీగా బకాయిలు ఉండటం వల్ల వైద్యశాలల నిర్వహణ భారంగా మారిపోతుందన్నారు. దీని వల్ల నాణ్యమైన వైద్యసేవలందింలేక ఎన్‌టిఆర్ వైద్యసేవలను ప్రజలకు అందజేయలేకపోతున్నామన్నారు. ప్రజలు తమకు సహకరించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

వీల్ చైర్ అందజేస్తున్న దృశ్యం

వీల్ చైర్ అందజేత

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మండలంలోని వికలాంగ విద్యార్థినీ విద్యార్థుల సంక్షేమం కోసం దాతలు అందించే సహకారం అభినందనీయమని ఐఇఆర్‌టి ఉపాధ్యాయులు వి రవి, జి దివ్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని భవిత కేంద్రంలో గరుకుపాలెం నివాసి చిరిపిరెడ్డి వీరనారాయణ కుమార్తె పవిత్ర వికలాంగురాల వడంతో ఎంఇఒ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో అలింకో సంస్థ సహకారంతో వీల్ చైర్ ను పవిత్రకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో 18 సంవత్సరాలు వయస్సు గల వికలాంగ విద్యార్థులందరికీ వీల్ చైర్స్, బ్రెయిలీ కిట్లు, రొవేటర్స్, ట్రై సైకిల్స్ తదితర పరికరాలను అలింకో సంస్థ ఆర్థిక సహకారంతో ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ కె మాధవరావు, ఆపరేటర్ ఎం. చంద్రశేఖర్, పాల్గొన్నారు.

పాఠశాలకు మంచి పేరు తేవాలి

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థినీ, విద్యార్థులు తల్లిదండ్రులకు, తాము విద్యనభ్యసించే పాఠశాలలకు మంచి పేరు, ప్రతిష్టలు తేవాలని మండల విద్యాశాఖాధికారి–2 అద్దంకి మల్లికార్జునరావు సూచించారు. శుక్రవారం మండలంలోని పోలినేనిపాలెం ఎంపియుపి స్కూల్ విద్యార్థిని బూదాల సింధు నవోదయ ప్రవేశ పరీక్షలో సీటు సంపాదించిన నేపథ్యంలో సింధుకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ మల్లికార్జున మాట్లాడుతూ సింధు నవోదయకు ఎంపికై తల్లిదండ్రులు బూదాల పుష్పలత – సింహాద్రి లకు అదే విధంగా పోలినేనిపాలెం పాఠశాలకు మంచి పేరు తెచ్చారని చెప్పారు. గ్రామ పెద్దలు, వలేటివారిపాలెం మండల సిపిఎం కార్యదర్శి మాదాల రమణయ్య మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగాల నిర్మలాదేవి, గ్రామ టిడిపి నాయకులు మానికొండ కొండయ్య, ఎస్ ఎం సి చైర్మన్ పొదిలి వెంకటేశ్వరి, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి-వలేటివారిపాలెం: మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి హుండీ ఆదాయం 14 శనివారాలకు గాను రూ.82,44,463 ఆదాయం వచ్చినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ సాగర్ బాబు తెలియజేశారు. అంతేకాకుండా బంగారం 178 గ్రాములు, వెండి1 కేజీ 5 గ్రాములు, యుఎస్ డాలర్ 56, యూఏఈ ధరమ్స్ 200,ఉమెన్ రియల్ 8 ఇంగ్లాండ్ పౌంట్స్ నేపాల్ 50 ఆదాయం వచ్చినట్లు తెలియజేశారు. పర్యవేక్షణ అధికారిగా వి.వి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాస్టర్ మృతిపై దర్యాప్తు జరపాలి

ప్రజాశక్తి-గుడ్లూరు పాస్టరు ప్రవీణ్ అనుమానాస్పద మతి పై సమగ్ర దర్యాప్తు జరిపించాలని గుడ్లూరు మండలం పాస్టర్స్ అసోసియేషన్ వారు శుక్రవారం డిమాండ్ చేశారు. గుడ్లూరులోని చర్చిలో జరిగిన సమావేశంలో నిర్ణయి ంచారు. పగడాల ప్రవీణ్ కుమార్ ఆయన కుటు ం బానికి ఏర్పాటు చేసుకున్న ఫౌండేషన్ లోని పిల్లలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

భవన నిర్మాణాలు జరిగేలా పర్యవేక్షణ

అనుమతుల మేరకే

ప్రజాశక్తి-నెల్లూరు : నగరపాలక సంస్థ కమిషనర్ ఎం. సూర్య తేజ వారాంతపు సమీక్షలో భాగంగా టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అనుమతులకు విరుద్ధంగా నగరంలో నిర్మించిన అన్ని భవనములకు చార్జిషీట్లు దాఖలు చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పలుమార్లు సంబంధిత కార్యదర్శులు, సిబ్బందిని హెచ్చరించడం జరిగిందని, ఇప్పటికీ చార్జిషీట్ దాఖలు పరచని వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని సిబ్బందిని కమిషనర్ హెచ్చరించారు.నగరంలో నెల్లూరు నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగం వారి అనుమతుల ప్రకారమే భవనముల నిర్మాణం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని, నిర్మాణాలను పిల్లర్ల స్టేజిలోని గుర్తించి అనుమతుల ప్రకారం నిర్మించనిచో వెంటనే నిర్మాణ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆదేశించారు. ఆక్యుపెన్సీ సర్టిఫికేట్ విడుదల కానిదే ఇతర డిపార్ట్మెంట్లు అనుమతులు మంజూరు చేయవద్దని ఫైర్, ఎలక్ట్రిసిటీ ఇతర ఆఫీసులకు లేఖలను పంపియున్నామని కమిషనర్ తెలియజేశారు.త్వరలో నక్ష సర్వే ద్వారా ప్రతి భవనము యొక్క స్వరూపము, ఉపయోగించు విధానము వివరములు తెలుస్తుందని, సర్వే ద్వారా భవనాల ప్లాన్ అనుమతులు, కమర్షియల్ భవనములకు ట్రేడ్ లైసెన్సుల మంజూరు వివరాలను ఖచ్చితంగా తెలుసుకోవచ్చని తెలిపారు. నిర్మాణంలో ఉన్న భవనానికి సంబంధించి పట్టణ ప్రణాళిక విభాగం వారు మంజూరు చేసిన అనుమతులను నిర్మాణ ప్రదేశంలో కనిపించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ట్రాఫిక్ కు అడ్డంకిగా రోడ్లపై, వీధులలో ఉన్న నిరుపయోగమైన వాహనాలను పోలీసు వారి సహాయముతో వెంటనే తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యము లేకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో సిటీ ప్లానర్ పద్మజ, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు వేణు, ప్రకాష్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, వార్డు సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమర్థవంతంగా పనిచేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు

ప్రభుత్వ ఉద్యోగులు సమర్థవంతంగా పని చేసి ప్రజల మన్ననలు పొందాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు.శుక్రవారం కలెక్టరేట్లోని ఎస్ ఆర్ శంకరన్ హాల్లో ప్రభుత్వం చేస్తున్న ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం గురించి ముఖ్యమైన శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల అభిప్రాయాలను ఐ వి ఆర్ కాల్స్, క్యూ ఆర్ కోడ్, వాట్సాప్ ల ద్వారా ప్రజల నుండి తెలుసుకుంటుందన్నారు. పెన్షన్లు, రేషన్, దీపం, అన్న క్యాంటీన్లు, ఎరువులు, విత్తనాలు, పారిశుధ్యం, ఆర్ టి సి సేవలు, దేవాలయాలు, వైద్య శాలలు,రోడ్లు, ఇసుక,మద్యం దుకాణాలు తదితర అంశాలపై అభిప్రాయాలను సేకరిస్తుందన్నారు. ప్రభుత్వం నుండి ప్రజలకు ఎంత మంచి సేవలు అందుతున్నాయో తెలుసుకుని మరింత మెరుగు పరచడానికేగానీ, ఎవరి మీద చర్యలు తీసుకోమని చెప్పారు. ప్రజలకు అందించే వివిధ రకాల సేవలలో ఉన్నటువంటి లోపాలను వారి ద్వారానే తెలుసుకుని సరిదిద్ది మరింత మెరుగ్గా అందించడానికి చేసే ప్రయత్నమే ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సూర్య తేజ, అడిషనల్ ఎస్ పి సౌజన్య, డిఆర్ఓ ఉదయభాస్కర్ రావు, డిఎంఅండ్‌హెచ్ఓ సుజాత, డి సి హెచ్ ఎస్ శేషారత్నం, విద్యుత్ ఎస్ఇ విజయన్, డిపిఓ శ్రీధర్ రెడ్డి, జిల్లా ప్రజా రవాణా అధికారి మురళీబాబు, సి పి ఓ నరసింహారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

పారిశుధ్య పనులు పరిశీలన

పజాశక్తి-నెల్లూరు: నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ చైతన్య పారిశుధ్య నిర్వహణ పనులలో భాగంగా స్థానిక ఇరుగాలమ్మ గుడి రాజీవ్ స్వగృహ వద్ద జరుగుతున్న శానిటేషన్ గ్యాంగ్ వర్క్ పనులను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి పారిశుధ్య సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం స్థానిక ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్ వద్ద జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని అందించాలి

ప్రజాశక్తి-వింజమూరు : ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలలో అభివృద్ధి సంక్షేమాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఎంఎల్ఎ కాకర్ల సురేష్ అన్నారు. వింజమూరులోని టిడిపి ప్రధాన కార్యాలయంలో ప్రజాపరిషత్ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రీవెన్స్ డేలో వచ్చే సమస్యలను సత్వరం పరిష్కరించాలని తెలియజేశారు. మెట్ట ప్రాంతమైన ఉదయగిరి నియోజకవర్గంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కింద పని దినాలను పెంచి ఉపాధి కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసే ప్రతి పని ఉపయోగపడేదేలా ఉండాలన్నారు. రైతులను నాయకులను భాగస్వామ్యం చేసుకుంటూ పనులు చేయాలన్నారు. గత సంవత్సరంలో మండలాల వారీగా చేసిన పని వివరాలు బడ్జెట్, ప్రస్తుత పరిస్థితి తదితర అంశాలను చర్చించారు. ప్రభుత్వానికి ప్రజలకు అధికారులు వారధిగా నిలిచి ప్రభుత్వానికి తనకు మంచిపేరు తేవాలని తెలిపారు. జరిమానాలు విధించకుండా ఉండాలని అధికారులతో మాట్లాడి వాటిని పరిష్కరించాలని అధికారులకు ఎంఎల్ఎ తెలియజేశారు. కార్యక్రమంలో ఎంపిడిఓలు, ఇఒపిఆర్‌డిలు, టిడిపి మండల కన్వీనర్లు, నాయకులు తదితరులు ఉన్నారు.

టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి-కోవూరు : మండలంలోని పోలిరెడ్డిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెన్నానది పరివాహక ప్రాంతంలో పర్యాటక రంగం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు జిల్లా టూరిజం మేనేజర్ సునీల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పోలిరెడ్డిపాలెం ప్రాంతంలో బోటింగ్, హెటల్, పార్క్ తదితర వాటి ఏర్పాట్లపై పరిశీలిస్తున్నామన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామ దత్తత నాయకుడు తిరుమూరు అశోక్‌రెడ్డి మాట్లాడుతూ పెన్నానది పరివాహక ప్రాంతంలో టూరిజం శాఖ ద్వారా బోట్ షికార్ ఏర్పాటు, తదితర వాటి ఏర్పాట్లకై కోవూరు ఎంఎల్ఎ వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ ప్రాంతంలో టూరిజంలో ఘనసీయమైన అభివృద్ధి కూడా సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సాయికిరణ్, ఎంపిటిసి నాగరాజు, ఏఈఓ నాగేశ్వరరావు వర్క్‌యర్ అశోక్, తదితరులు ఉన్నారు.

పాఠశాలకు మైకెసెట్ బహూకరణ

ప్రజాశక్తి-ఎఎస్‌పేట : మండల పరిధిలోని కావలి ఎడవల్లి గ్రామపంచాయతీ సంబంధించిన ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి నాగినేని శ్రీనివాసులు పాఠశాల ఆయన తల్లి వెంకట సుబ్బమ్మ జ్ఞాపకార్థం అహుజా కంపెనీ వారి సౌండ్ సిస్టం మైకెసెట్‌ను బహూకరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ ఇదే పాఠశాలలో తాను పదవ తరగతి వరకు చదువుకున్నానని, ఈనాడు తాను వెంకటాచలం మండలం తహశీల్దారుగా విధులు నిర్వహిస్తున్నానని, ఎన్నో వేల లక్షలు పెట్టి కార్పొరేట్ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తేనే జాబ్స్ వస్తాయన్న అపోహలు నమ్మవద్దని, మన గవర్నమెంట్ పాఠశాలల్లో మంచి విద్యాబుద్ధులు చెప్పే ఉపాధ్యాయులు ఉన్నారన్నారు. మన పాఠశాల విద్యార్థులు క్రీడారంగంలో ప్రతిభ కనబర్చినందుకు ఆయన పలువురు క్రీడాకారులను అభినందించారు. మన పాఠశాలలోని విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత శిఖరాలను అధిరోహించి, మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు, తహ ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థి అయిన నాగినేని శ్రీనివాసులను సత్కరించారు.

నారాయణచార్యుల జయంతి

ప్రజాశక్తి-ఉదయగిరి : ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో శుక్రవారం పుట్టపర్తి నారాయణ చార్యులు 122వ జయంతి సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జి.కృష్ణారెడ్డి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ నారాయణ చార్యులు అతిచిన్న వయసులోనే భారతం భాగవతం పురాణాలతో పాటు సంగీతాన్ని కూడా నేర్చుకుని సంస్కృతంలో శిరోమణి విద్వాన్ డిగ్రీలలో ఉత్తీర్ణత సాధించారన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోపికృష్ణ, డాక్టర్ రఘునాథ రెడ్డి, డాక్టర్ సునీత, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ జి.రమేష్, డాక్టర్ కిషన్ తేజ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కమల ప్రియ, ధనుంజయ చారి, బోధ నేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

'ఆర్ఎస్ఆర్'లో క్రీడా దినోత్సవం

ప్రజాశక్తి-బిట్రగుంట : బోగోలు మండలంలోని రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం సాయంత్రం 17వ క్రీడా దినోత్సవం ఘనంగా నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి వి ఎన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్, కరస్పాండెంట్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి, జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్లో హెడ్ అండ్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న డాక్టర్ పి.ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. చైర్మన్ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మాట్లాడారు. తదనంతరం రాష్ట్రస్థాయిలో, యూనివర్శిటీ స్థాయిలో వివిధ క్రీడలలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో బహుమతులు సాధించిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎఒ ఆర్‌వి రమణారెడ్డి, పిడి ఎ.కిరణ్ కుమార్, అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'వేదగర్భ' స్కూల్లో వార్షికోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -సీతారామపురం : స్థానిక వేదగర్భ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో 6వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల అడ్మిన్ డైరెక్టర్ కనుమర్లపూడి పవన్ కుమార్, ప్రిన్సిపల్ డి.నరేష్ ఆధ్వర్యంలో వేడుకలకు హాజరైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఇతర ప్రజలందరికీ అల్పాహార విందు ఏర్పాటు చేసి పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. పలు పౌరాణిక, సాంస్కృతిక దేశభక్తిని చాటే స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలలో చిన్నారులు పలు నాటకాలు వేసి చూపరులను అలరించారు. అదేవిధంగా డ్యాన్స్ పోటీలు నిర్వహించి విద్యార్థులను ఆహ్లాదపరిచారు. ఈ సందర్భంగా వేదగర్భ ఇంగ్లీష్ మీడియం పాఠశాల అడ్మిన్ డైరెక్టర్ పవన్ మాట్లాడుతూ తమ పాఠశాలలో దిగ్విజయంగా 6వ వార్షికోత్సవ వేడుకలు జరపడం సంతోషంగా ఉందని, వేదగర్భ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తామన్నారు.

అభివృద్ధి పనులకు ఏకగ్రీవ ఆమోదం

ప్రజాశక్తి-బుచ్చిరెడ్డిపాలెం : బుచ్చిరెడ్డిపాలెం నగర పంచాయతీ కార్యాలయంలో 2024-25 బడ్జెట్ల సమావేశం చైర్ పర్సన్ మోర్ల సుప్రజా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 -25 నగర పంచాయతీ ఆదాయం విలువ 22 కోట్ల 88 లక్షలు కాగా నగర పంచాయతీ ఖర్చులు 17 కోట్ల 25 లక్షల రూపాయలు అయ్యాయని రూ.5 కోట్ల నగర పంచాయతీలో నిధులు ఉన్నాయని అధికారులు తెలపడం జరిగిందన్నారు. 13 అజెండాల అభివృద్ధి బడ్జెట్ సమావేశాలకు కౌన్సిలర్లు ఏకగ్రీవ ఆమోదం తెలిపినందుకు వారికి చైర్‌పర్సన్ ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్ డి.బాలకృష్ణ, వైస్ చైర్మన్ ఎర్రటపల్లి శివకుమార్ రెడ్డి, పఠాన్ నస్రీన్‌ఖాన్, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తులు

ప్రజాశక్తి-కలిగిరి : మండల కేంద్రంలోని ఎపి మోడల్ స్కూల్‌లో 2025 -26 సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సర ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఏ శ్రీను తెలియజేశారు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులు రూ.150, ఒసి, బిసి విద్యార్థులు రూ.200 ఆన్‌లైన్‌లో మే 22వ తేదీ లోపు దరకాస్తు చేసుకోవాలని తెలియజేశారు. 2025-26 విద్యా సంవత్సరానికి మారిన సిలబస్ ప్రకారం అన్ని గ్రూపులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10వ తరగతిలో వచ్చిన మార్పులు ఆధారంగా ప్రవేశం కోర్సులు ఇవ్వబడును వివరాలకు ఎపి మోడల్ స్కూల్‌లో సంప్రదించాలన్నారు.

పెట్రోల్ బంక్ పనులు పరిశీలన

ప్రజాశక్తి కోవూరు : ఇనమడుగు గ్రామ పంచాయతీలో వడుగుపాడు సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న పెట్రోల్ బంక్ పనులను శుక్రవారం సొసైటీ సిఇఒ గోవర్ధన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చేపట్టే ఈ పనులు మరింత వేగవంతం కావాలన్నారు. 'ముఖ్యంగా నిర్మాణ పనుల్లో నిర్ధేశించిన నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. సాధ్యమైనంత త్వరగా చేపట్టిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కోవూరు కాంతినగర్లో ఉన్న వడుగుపాడు సహకార పరపతి సంఘం కార్యాలయ ప్రాంగణంలో శనివారం సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు సొసైటీ వర్సన్ ఇన్‌ఛార్జి కె.సుబ్రహ్మణ్యం, సొసైటీ సిఇఒ గోవర్ధన్‌రెడ్డి లు తెలిపారు. రెడ్‌క్రాస్ వారి సహకారంతో సుభాష్ సేవా సంఘం చొరవతో రక్తదాన శిబిరం కూడా నిర్వహిస్తున్నమన్నారు. కార్యక్రమంలో రైతులు, యువత పాల్గొని రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు.

ఇండోసోల్ ప్రాజెక్టు కరేడుకు బదిలీ

- మారుస్తూ ఉత్తర్వులు జారీ చేసిన పరిశ్రమల శాఖ
- కరేడులో 8348 ఎకరాల భూమిని కేటాయిస్తూ ఉత్తర్వులు

ఇండోసోల్ ప్రాజెక్టు ఇదే..

ప్రజాశక్తి-కందుకూరు

ఇండోసోల్ ప్రాజెక్టును ఉలవపాడు మండలంలోని కరేడుకు మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. గుడ్లూరు మండలంలోని చేవూరు వద్ద ఈ ప్రాజెక్టు నిర్మాణ పనులను గత ప్రభుత్వ హయాంలోనే ప్రారంభించిన విషయం తెలిసిందే. చేవూరు పరిసర ప్రాంతాల భూములను చమురు శుద్ధి కర్మాగారం ఏర్పాటుకు కావాలని భారత పెట్రోలియం కార్పొరేషన్ సంస్థ కోరడంతో రాష్ట్ర ప్రభుత్వం ఇండోసోల్ ప్రాజెక్టును ఉలవపాడు మండలంలోని కరేడుకు బదిలీ చేసింది. రాష్ట్ర పరిశ్రమల శాఖ కమిషనర్ యువరాజు ఈనెల 25న ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కరేడు గ్రామ పంచాయతీలోని 8348 ఎకరాలను ఈ ప్రాజెక్టు కోసం కేటాయిస్తున్నట్లు పరిశ్రమల శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. ప్రాజెక్టు నీటి అవసరాల కోసం కరేడు సాగునీటి చెరువుని కూడా కేటాయించారు. సాగునీటి చెరువుతో పాటు దాని ఆయకట్టు భూములు అన్నిటిని ప్రాజెక్టు కోసం సేకరిస్తామని ప్రభుత్వం ఉత్తర్వులలో స్పష్టం చేసింది. సోలార్ టీవీల మ్యాడ్యువల్ ఉత్పత్తి తో పాటు సౌర, వాయు తదితర మార్గాలలో విద్యుత్ ఉత్పత్తి చేయడం ఈ ప్రాజెక్టు చేపడుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి దశలవారీగా 69 వేల కోట్ల రూపాయలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రాజెక్టు అవసరాల కోసం అవసరమైతే సింగరాయకొండ మండలంలోని బింగినపల్లిలోను భూసేకరణ జరుపుతామన్నారు. బింగినపల్లి ,కరేడు మధ్య ఉన్న మన్నేరుపై నిర్మాణాలను కూడా చేపడతారు. ఈ ప్రాజెక్టు కోసం స్వాధీనం చేసుకున్న కరేడు చెరువు విస్తీర్ణం సుమారు 1200 ఎకరాలు. మన్నేరు నీటి ఆధారంగా ఈ చెరువు ఉంది. గ్రామంలో మరో 1200 ఎకరాల వరకు అటవి భూమి వుంది. రిజర్వు అటవీశాఖ ,అటవీ అభివృద్ధి సమస్త కింద ఈ భూములు ఉన్నాయి. ఈ భూమిని ఎకరానికి సంవత్సరానికి 31 వేల రూపాయల వంతున ఇండోసోల్ కంపెనీకి కౌలుకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కౌలు ధర ఏటా ఐదు శాతం పెంచుతారు.

భగ్గుమన్న కరేడు ప్రజలు

కరేడును ఇండోసోల్ ప్రాజెక్టుకు కేటాయించారని సమాచారం అందడంతో ఆ గ్రామ ప్రజలు శుక్రవారం ఉదయం నుంచి భగ్గు మంటున్నారు. కరేడు గ్రామ పంచాయతీలోని 22 ఆవాస ప్రాంతాలలో సుమారు 600 ఎకరాలు రెండు పంటలు పండే భూమి ఉంది. తుంపర సేద్యం కింద ఈ భూముల్లో వేరుశనగ సాగు చేస్తారు. బహిరంగ మార్కెట్లో ఈ భూముల ధర ఎకరానికి 25 లక్షలకు పై మాటే. ఇలాంటి భూములను ఇండోసోల్ ప్రాజెక్టు కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలియడంతో ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి కరేడు గ్రామం లోని భూములు పరిశ్రమల కోసం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది అనే వార్తలు నెల రోజులుగా వినిపిస్తున్నాయి. దీంతో ఇంతకు ముందే కరేడు గ్రామ పంచాయతీలోని వివిధ గ్రామాల ప్రజలు భూసేకరణ చేస్తే అడ్డుకుంటామంటూ నిరసన ధ్వనులు విని పించారు. ఇప్పుడు ప్రభుత్వ ఉత్తర్వులతో కరేడు గ్రామానికి చెందిన రైతులు, మత్స్యకారులు పెద్ద ఎత్తున ఉద్యమించే అవకాశం ఉంది.

ట్రాక్టర్లు పంపిణీ

తాళాలు ఇస్తున్న ఎంఎల్ఎ కాకర్ల సురేష్

ప్రజాశక్తి-వింజమూరు

స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా, స్వచ్ఛ భారత్ నిధుల నుండి చాకలికొండ, కాటేపల్లి పంచాయతీలకు మంజూరైన రెండు ట్రాక్టర్లను ఎంఎల్ఎ కాకర్ల సురేష్ ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు, కార్యదర్శులకు, శుక్రవారం పంపిణీ చేశారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్లను ఎంఎల్ఎ దంపతులు ట్రాక్టర్ పైకి ఎక్కి నడిపారు. అనంతరం ఎంఎల్ఎ కొబ్బరికాయ కొట్టారు. ఎంఎల్ఎ శ్రీమతి కాకర్ల పద్మ, సర్పంచ్ చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యం మెరుగునకు సుమారు రూ.12 లక్షల విలువ కలిగిన ట్రాక్టర్లను పంపిణీ చేశామన్నారు. వీటిని వినియోగించుకొని గ్రామాలలో పారిశుధ్యాన్ని మెరుగుపరిచి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలని తెలిపారు. ట్రాక్టర్ల ద్వారా సేకరించిన చెత్తను సంపద కేంద్రాలకు తరలించి సంపద సృష్టించాలని తెలిపారు. ఇంతకాలం వాహనాలు లేని ఈ రెండు పంచాయతీలకు వాహనాలు రావడంతో గ్రామ సర్పంచులు నాయకులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చాకలికొండ సర్పంచ్ ఉప్పిరెడ్డి సుబ్బలక్ష్మి కుమారి, డాక్టర్ చైతన్య, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, కొండాపురం మాజీ జెడ్‌పిటిసి దామా మహేష్, టెలిఫోన్ అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ తాటికొండ అనసూ, కాటేపల్లి సర్పంచ్ ముప్పూరి విజయ లక్ష్మమ్మ, లెక్కల వెంగళరెడ్డి, దిండు నారాయణ, ఉప సర్పంచ్ నాగేంద్రబాబు, శీను నారాయణ, దిండు కరీం, దిండు వెంకటేష్, కార్యదర్శులు శేఖర్ షరీఫ్ తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-మర్రిపాడు : మండలంలోని అల్లంపాడు గ్రామానికి చెందిన షేక్.ఖాజావలీ గత కొంతకాలంగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న పల్లవోలు గ్రామానికి చెందిన వైసిపి నాయకులు పఠాన్ గౌస్‌బాషా గ్రామంలోని తమ బంధువులతో విషయం చర్చించి అందరూ కలసి రూ.13వేల ఆర్థికసాయం చేశారు. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవత్వం, తమ లక్ష్యమన్నారు.

తాగునీటి సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్

రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని తాగునీటి సమస్యలు లేకుండా అన్ని గ్రామ పంచాయతీల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ ఐజాక్‌ప్రవీణ్ సూచించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి డేవిడ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ సుదర్శన్‌తో కలసి పంచాయతీ కార్యదర్శులతో తాగునీటి సమస్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాలలో గ్రామపంచాయతీ సర్పంచ్‌లతో కలసి చర్చించి తాగునీటి సమస్యలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఎక్కడైనా రిపేర్లు, లీకేజీల వంటివి ఉంటే వెంటనే పూర్తి చేయించాలని ఆయన సూచించారు. గ్రామపంచాయతీలలో మోటార్లు రిపేర్లు వచ్చినట్లయితే వెంటనే పూర్తి చేయించాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కోరారు. అదేవిధంగా బోర్లు రిపేర్లు ఉంటే ముందుగా తెలియజేసి బోర్ మెకానిక్ ద్వారా అవసరమైన రిపేర్లను చేయించడానికి మండల పరిషత్ కార్యాలయంలోని రిజిస్టర్‌లో నమోదు చేయవలసినదిగా తెలియజేశారు. ఇఒపిఆర్‌డి డేవిడ్ మాట్లాడుతూ మార్చిలోపు ఇంటి పన్ను నూరుశాతం వసూలు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా ట్యాంకుల క్లోరినేషన్ క్లీనింగ్ విషయాలలో శ్రద్ధ వహించాలని కోరారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి

- వరికుంటపాడు ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు డాక్టర్ కరిష్మా

ప్రజాశక్తి వరికుంటపాడు

వేసవి నేపథ్యంలో ఎండ తీవ్రతకు గురికాకుండా తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కరిష్మా సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే లో కావాల్సిన ఉష్ణోగ్రతలు మార్చిలో నమోదు వల్ల ఎండలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఎండ తీవ్రతకు తల తిరగడం, మత్తు నిద్ర, తీవ్రమైన జ్వరం కలిగి ఉండటం లేదా పూర్తి అపస్మారక స్థితి ఉంటుందని అలాంటప్పుడు తప్పకుండా వైద్య సేవలు చేయించుకోవాలని ముఖ్యంగా పిల్లలు, బాలింతలు, బిపి ఉన్నవాళ్లు జాగ్రత్తగా ఉండాలని మీరు తప్పని పరిస్థితిలో బయటకు వెళ్లవలసి వచ్చినప్పుడు నీడ కోసం తలకు టోపీ, టువాలు, గొడుగు తీసుకువెళ్లాలని వేసవిని దృష్టిలో ఉంచుకొని ఉప్పును కలిపిన మజ్జిగ, ఓఆర్ఎస్ కలిపిన నీటిని ఎక్కువగా తాగాలని ఆమె సూచించారు.

ఆధునికీకరణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ఆత్మకూరు పట్టణంలోని 3వ వార్డు ఎల్ఆర్‌పల్లి ప్రాంతంలో ఉన్న పీర్ల చావిడి వద్ద జెండా చెట్టు ఆధునికీకరణ పనులను కౌన్సిలర్ గౌస్‌బాషా శుక్రవారం ప్రారంభించారు. జెండాచెట్టు వద్ద శిథిలమైన అరుగును ఆధునికీకరణ పనులు చేపట్టారు. రంజాన్ పండుగతో పాటు పీర్ల పండుగ సందర్భంగా ఇక్కడ ఉన్న జెండా చెట్టు వద్ద ముస్లీం సోదరులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారని, ఈ అరుగు ప్రాంతం పాక్షికంగా దెబ్బతినడంతో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు పనులు చేపట్టినట్లు తెలిపారు.

సుగర్ ఫ్యాక్టరీ భూములను కాపాడాలి

- కార్పొరేట్‌కు అప్పగించొద్దని సిపిఎం డిమాండ్

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-కోవూరు : కోవూరు సుగర్ ఫ్యాక్టరీ భూములను కాపాడాలని, ఎపిఐఐసి (ఎపిక్) సంస్థకు అప్పగించరాదని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం కోవూరు మండబైలు సెంటర్లోని కామ్రేడ్ సీతా పోలయ్య భవనంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు టివివి ప్రసాద్ మాట్లాడుతూ సుగర్ ఫ్యాక్టరీ రీ ఓపెన్ చేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన కూటమి ప్రభుత్వం చివరకు కొత్త పరిశ్రమల కోసం ఫ్యాక్టరీ విలువైన భూములను కార్పొరేట్‌లకు కేటాయిస్తున్నాం అనడం రైతులను కార్మికుల ను మోసం చేయడమే అన్నారు. ఇదే నియోజకవర్గంలో రాచర్ల పాడు వద్ద ఇఫ్కో భూములున్నా పారిశ్రమ స్థాపనలేవన్నారు. ప్రజాప్రతినిధులు కమీషన్ల కోసమే కొత్త నాటకం తెరమీదకు తెచ్చార న్నారు. ఐతే 15 మండలాల్లో 5840 మంది షేర్ హోల్డర్ల హక్కు సహార చక్కెర కర్మగారం ఉన్నదున వరిపంటకు ప్రత్యామ్నాయ పంట చెరుకును పండించేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నిదులు సమీకరించా లని విలువైన ఫ్యాక్టరీ భూములను కార్పొరేట్ గద్దలకు అప్ప చెప్పద్దని హితవుపలికారు. ప్రభుత్వ తీసు కున్న నిర్ణయం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఫ్యాక్టరీ నిర్మాణానికి అవసర మైన నిధులు కేటాయించాలని కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ముత్యాల గురు నాథం, గండవరపు శ్రీనివాసులు, గోనె దయాకర్, పులిగండ్ల శ్రీరాములు, గండవరం శేషయ్య, బట్ట పెద్ద అబ్బాయి, షేక్ బాబు, అఫ్రోజ్ అహ్మద్, ఊటుకూరు రమణయ్య, ప్రభాకర్, సురేష్, మనీ, చాన్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతులను భర్తీ చేయాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మాట్లాడుతున్న నాయకులు

స్థానిక కార్యాలయం ఆవరణంలో శుక్రవారం ప్రారంభమైన సర్వసభ సమావేశంలో ఎ.పి.పి.టి.డి ఎంప్లాయిస్ యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ జి.నారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎ పి ప్రజా రవాణా శాఖ ఆర్‌టిసిలో సాంకేతిక కారణాలతో పదోన్నతులు ఇవ్వడంలో దాదాపు 3సంవత్సరాల నుండి జరుగుతున్న జాప్యం కారణంగా వేలాది ఉద్యోగోన్నతి ఖాళీలు భర్తీ చేయనందున ఉద్యోగుల్లో ఆందోళన నెలకొన్న దృష్ట్యా వెంటనే పదోన్నతులు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారుల స్థాయి నుండి నాల్గవ తరగతి ఉద్యోగుల దాకా ఉద్యోగోన్నతుల్లో జాప్యం కారణంగా సంస్థ బస్సు సర్వీసులను నడపడంలో, మేయింటెనెన్స్‌లో పరిపాలనలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఈ జాప్యం కారణంగా చాలామంది ఉద్యోగులు పదోన్నతి లేకుండానే రిటైరవుతునారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కావున పదోన్నతి ఖాళీలను ప్రభుత్వం తక్షణమే భర్తీ చేసేందుకు ఆదేశాలివ్వాలని కోరారు. అలాగే జిల్లా కార్యదర్శి ఒవి ప్రసాద్ మాట్లాడుతూ ఆదాయం తీసుకురావట్లేదని, ఇంధన పొదుపులో వెనుకబడి ఉన్నారని కండక్టర్లు, డ్రైవర్లపై అధికారుల వేధింపులు మానుకొని వారిలో ఆందోళన నివారించాలని కోరారు. అధికారులు, సూపర్వైజర్లు రోడ్డు మీదకు వచ్చి వాస్తవాలను గ్రహించాలని, రూట్ సర్వేలు జరపాలని, ప్రభుత్వ సహకారంతో అక్రమ రవాణా అరికట్టాలని కోరారు. అనంతరం ఈ యు ఉదయగిరి డిపో నూతన కమిటీనీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డిపో అధ్యక్షుడిగా షేక్ మహమ్మద్ రఫీ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బి.వి.కృష్ణయ్య, కార్యదర్శిగా డబ్బుగొట్టు పెంచలయ్య, జాయింట్ సెక్రటరీగా గోపాలకృష్ణ, కమిటీ సభ్యులుగా యల్.వెంకటేశ్వర్లు, ఎస్.కె.యం.బాషా, నాయబ్ రసూల్, అశ్వని కుమార్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు బి.మాల్యాద్రి, ఉయ్యాల రమేష్, డిపో సీనియర్ నాయకులు ఏ.భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

పొగాకు బేళ్లు కొనుగోలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలం లోని డిసిపల్లి పొగాకు వేలం కేంద్రానికి గుండె మడకల క్లస్టర్‌కు చెందిన రైతులు 337పొగాకు బేళ్ళను వేలం కేంద్రానికి తీసుకురాగా, 322బేళ్ళను పలు కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. వివిధ కారణాలతో 13పొగాకు బేళ్లను తిరస్కరించారన్నారు. వాటిలో ఎన్‌బి 05ఎన్ ఎస్ 04సిఆర్ 04కాగా అధిక బరువుతో ఉన్న 02బేళ్ళను వేలానికి తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280, కనిష్ఠ ధర రూ.255సగటు ధర రూ.275.29నమోదు కాగా వేలంలో 8మంది కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నట్లు తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట

మండల పరిధి లోని రాజవోలు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శనగ విత్తన కొనుగోలు కేంద్రం మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ఎస్.పవన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనగలు ఒక క్వింటాల్ రూ.5650 మద్దతు ధర వంతున శనగ జె4-11 రకాన్ని అమ్ముకొనే అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎఒ టి.రజిని, సిఇఒ రమేష్ రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

గణితం సాధన చేయించాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మండలం లోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు విద్యార్థులతో మనోగణితం సాధన చేయించాలని ఎంఇఒ-1 మస్తాన్ వలీ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం గుడి నరవ, ఎస్‌వి చింతల పాఠశాలలను తనిఖీ చేశారు. అన్ని తరగతుల విద్యార్థుల అభ్యసన పఠన సామర్థ్యాలను నైపుణ్యాలను పరిశీలిస్తూ విద్యార్థులకు మనోగణితం అభ్యాసం చేయించాలన్నారు. పూర్తి అయిన పాఠ్యాంశాలలో క్విజ్ పోటీలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు టిడిపి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-వరికుంటపాడు

టిడిపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన వరికుంటపాడు బస్టాండ్ సెంటర్లో శనివారం టిడిపి జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని ఈ కార్యక్రమానికి ఎంఎల్ఎ కాకర్ల సురేష్ హాజరవుతున్నారని టిడిపి మండల అధ్యక్షులు చండ్రా మధుసూదన్ రావు తెలిపారు. కార్యక్రమానికి పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-కోవూరు

కోవూరు ఎక్సైజ్ పరిధిలోని నాలుగు మండలాల్లో ఎక్కడైనా సమయపాలన పాటించని మద్యం షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని కోవూరు ఎక్సైజ్ కిషోర్ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా కోవూరు ఎక్సైజ్ పరిధిలోని నాలుగు మండలాలు కోవూరు, కొడవలూరు, విడవలూరు, అల్లూరు మండలాల్లో ఎక్కడైనా బెల్ట్ షాపులు నిర్వహించిన గంజాయి అమ్మిన నాటు సారా సమాచారాన్ని తమకు తెలియజేస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. సమాచారం తెలియజేయాల్సిన సెల్ ఫోన్ నెంబర్ 9440902425 అని తెలిపారు. అక్టోబర్ 16 నుండి కొత్త మద్యం పాలసీ అమల్లోకి వచ్చిందన్నారు. ఈ పాలసీ నిబంధనలను పాటించని షాపులపై షాపుల లైసెన్స్ దారులపై చర్యలు తప్పవన్నారు. ఇప్పుడు వరకు నాలుగు మండలాల్లో 55 మంది బెల్టు షాపులు నిర్వహిస్తున్న వారిపై కేసులు పెట్టడం జరిగిందన్నారు. వీళ్లను అరెస్టు చేసి తహశీల్దార్ వద్ద హాజరు పరచటం జరిగిందన్నారు. ఈ నాలుగు మండలాల్లో ఎక్కడైనా గంజాయి సమాచారం నాటుసారా సమాచారం తెలియజేయాలని ఆయన కోరారు.

జాయింట్ సెక్రటరీగా గంగిరెడ్డి

ప్రజాశక్తి-కందుకూరు

కందుకూరు వైసిపి నాయకులు గణేశం గంగిరెడ్డికి పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ జాయింట్ సెక్రటరీగా నిమితులయ్యారు. వైసిపి పెట్టిన దగ్గర నుండి పార్టీ కోసం అహర్నిశలు కృషి చేస్తూ, కందుకూరు నియోజకవర్గానికి పలుమార్లు ఎమ్మెల్యే అభ్యర్థులను మారుస్తూ వచ్చినప్పటికీ అధిష్టాన నిర్ణయానికి కట్టుబడి పార్టీ కోసం నిలబడ్డ వ్యక్తి గణేశం గంగిరెడ్డి. జగన్మోహన్ రెడ్డి ఎటువంటి నిర్ణయం తీసుకున్న దాన్నే శిరోధార్యంగా భావించి పార్టీ కోసం నిలబడ్డ అటువంటి వ్యక్తి గంగిరెడ్డి. అటువంటి వ్యక్తిని గుర్తించిన వైసిపి అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్య మంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కందుకూరు నియోజకవర్గం నుంచి గణేశం గంగిరెడ్డిని వైస్సార్సీపీ పార్టీ రాష్ట్ర బూత్ కమిటీ వింగ్ జాయింట్ సెక్రటరీ గా నియమించారు. ఈ పదవి రావడానికి సహకరించిన మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి , మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఏరియా ఆస్పత్రి అభివృద్ధి పనులు వేగవంతం

ప్రజాశక్తి-కందుకూరు

కూటమి ప్రభుత్వం లో వైద్య ఆరోగ్య శాఖ ద్వారా విడుదలైన నిధులతో కందుకూరు శాసనసభ్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షులు ఇంటూరి నాగేశ్వరరావు నేతృత్వంలో ఏరియా కందుకూరు ఆసుపత్రి లో జరుగుతోన్న అభివృద్ధి పనులను , రోగులకు అందుతున్న సేవలను అధికారుల ద్వారా శుక్రవారం తెలుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు ముప్వల భూషయ్య, గడ్డం మాలకొండయ్య, శిగా తిరుపాలు పాల్గొన్నారు.

క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలి

ప్రజాశక్తి-కోవూరు

ఇంజనీరింగ్ విద్యార్థులు చదువులోనే కాకుండా క్రీడలలో కూడా దృష్టి సారిస్తే అవి వారికి ఎంతగానో మేలు చేస్తాయని ఎస్ఐ రంగనాథ్ గౌడ్ అన్నారు. మండలంలోని గంగవరం గ్రామంలోని గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం 2025 వార్షిక క్రీడోత్సవాన్ని విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు దేహదారుఢ్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కూడా కలిగిస్తాయన్నారు. వీటి వలన ఏకాగ్రత పెరిగి మెదడు మరింత చురుకుదనాన్ని పెంపొదిస్తుందన్నారు. దానిని దృష్టిలో పెట్టుకుని ప్రతి విద్యార్థి కనీసం రోజుకు అరగంట పాటు సమయాన్ని క్రీడలపై దృష్టి పెట్టాలన్నారు. కళాశాల కార్యదర్శి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులైన విద్యార్థులకు ప్రభుత్వం ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సందీప్ కుమార్, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ అశోక్ కుమార్లు పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి క్రీడా జ్యోతిని వెలిగించి అనంతరం క్రీడాకారుల మార్చ్‌ఫాస్ట్‌ను స్వీకరించారు. ఆనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

భోజన ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి-కందుకూరు : ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుద్దాం వారి కళ్లల్లో ఆనందాన్ని చూద్దాం అనే నినాదంతో నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా పయనిస్తున్న శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ కందుకూరు వారి ఆధ్వర్యంలో సొసైటీ సభ్యుల సహకారంతో కందుకూరు పట్టణ వీధుల్లో తిరుగుతూ ఉంటే నిరాశ్రయులకు, యాచకులకు భోజనం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయడం జరిగింది. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ రవ్వా శ్రీనివాసులు, సభ్యులు ఇన్నమూరి శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు, గుర్రం చిన్న అల్లూరయ్య పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, NAYUDU SYAMSUNDAR RAO (Old Name) Son of NAYUDU VENKATA SWAMI resident of D.No.11-31-50, Near Kalyana Mandapam, Pullareddy Nagar, Kavali Town, SPSR Nellore Dist. A.P. hereby declare that I have changed my name as

NAYUDU SYAM SUNDAR
(New Name)
Henceforth, I will be known as
NAYUDU SYAM SUNDAR

ప్రకటన

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, నెల్లూరు రూరల్ మండలం, పొట్టేపాళెం గ్రామం, లేట్ **పోలయ్య** గారి కుమారుడు **పొట్టేపాళెం చంద్రమౌళి** గారికి సంబంధించిన **సర్వే నెం.187/1 రులో 24 అంకణములు కోరుమెట్ట,** నెల్లూరు సబ్-రిజిస్ట్రారు వారి ఆఫీసు నందు రిజిష్టరు కాబడిన **ఒరిజినల్ రిజిష్టరు దాక్యుమెంటు నెం.4909/1991 రును** నా క్లయింట్ పొట్టేపాళెం చంద్రమౌళి **తే28-03-2025ది** న పొట్టేపాళెం నుండి నెల్లూరుకు తీసుకొని జెరాక్స్ కొరకు మోటారు బైక్‌పై పోవుచుండగా మార్గమధ్యలో జారిపడిపోయినవి. సదరు **ఒరిజినల్ రిజిష్టరు దాక్యుమెంటు నెం.4909/1991 రు** గల ఎవరికైన దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు తెలిపి తగిన పారితోషికము పొందగలరు.

ఇట్లు
సి.రామగోపాల్ రెడ్డి, బి.కాం., బి.ఎల్.,
అడ్వకేట్, రూమ్ నెం.7, జిల్లా కోర్టు ఎదురుగా,
నెల్లూరు నగరం, సెల్: **94940 84688**

కౌంటర్ సంతకం:
పొట్టేపాళెం చంద్రమౌళి
సెల్: **98483 03488**

డాక్యుమెంటు పోయినది

నా క్లయింట్స్ అయిన **దేసు మురళికృష్ణ, దేసు పద్మ,** పొగతోట, నెల్లూరు టౌన్, నెల్లూరు జిల్లా. **ఒరిజినల్ రిజిష్టర్ దాక్యుమెంటు నెం.4134/2022** షెడ్యూలు దాఖలా ఆస్థికి నా క్లయింట్స్‌లకు సంబంధించిన **ఒరిజినల్ రిజిష్టరు లింక్ దాక్యుమెంటు నెం.1107/1987 తేది: 17-03-2025** న నా క్లయింటు పొగతోట నుండి ట్రంక్ రోడ్డు జెరాక్స్ కొరకు తీసుకొని పోవుచుండగా మాంమధ్యలో పడిపోయినది. ఈ ఒరిజినల్ రిజిష్టరు లింక్ డాక్యుమెంటు ఎవ్వరికైనా దొరికినయెడల ఈక్రింది అడ్రసుకు తెలిపి తగిన పారితోషికం పొందగలరు.

శనగవరపు ఆనంద బాబు,
న్యాయవాది, మూలాపేట, నెల్లూరు.
సెల్: **93916 93015**

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO. 8 of 2024
HMOP.NO.110 of 2023

దొడ్ల యుగంధర్ రెడ్డి ...పిటీషనరు/పిటీషనరు
Vs
సద్ద జీవిత @ దొడ్ల అభిగ్న ...రెస్పాండెంటు/రెస్పాండెంటు

నోటీసు

సద్ద జీవిత @ దొడ్ల అభిగ్న, W/o భర్త యుగంధర్ రెడ్డి, D/o రాజారెడ్డి, గిలకపాడు గ్రామము, రాపూరు మండలం, నెల్లూరు జిల్లా.

పై నెంబరులో పిటీషనరు పై OP.NO.110 of 2023 ను పునరుద్ధరించమని పిటీషను దాఖలు చేసినందున మీ నోటీసు నిమిత్తం తే. 8-4-2025 దీకు వాయిదా వేసియున్నారు. ఆ దినము మీ కేమైనా ఆక్షేపణలున్నయెడల పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు హాజరై తెలుపుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

ఇట్లు,
Y. సుహాసిని, M.A, B.L.,
పిటీషనరు తరపు అడ్వకేటు.